నమస్తే తెలంగాణ

కామారెడ్డి

5 | నిజామాబాద్, సోమవారం 25 మార్చి 2024 | KAMAREDDY


రంగుల పండుగకు వేళయ్యింది. హోలీ సంబురాలు జరుపుకొనేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. రంగులు చల్లుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కొన్నిచోట్ల హోలీ పండుగను ఆదివారం జరుపుకోగా.. మిగతా ప్రాంతాల్లో సోమవారం జరుపుకోనున్నారు. హోలీ సందర్భంగా చిన్నాపెద్ద కలిసి వేడుకల్లో పాల్గొననున్నారు. యువతతోపాటు చిన్నారులు సైతం రంగులను కొనుగోలు చేసే పనుల్లో పడ్డారు. దీంతో రంగులు విక్రయించే దుకాణాలు రద్దీగా మారాయి. కొన్ని కాలనీల్లో ఒకచోట అందరు చేరి రంగులు పూసుకుంటూ వేడుకలను జరుపుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమ స్నేహితులతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేందుకు రెడీ అయ్యారు.

–సుభాష్‌నగర్, మార్చి 24





ఇందూరు నగరంలో ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో కామదహనం

# హోలీ.. ఆనందాల కేళీ



కామారెడ్డిలో..





- నేడు రంగుల పండుగ
- పలుచోట్ల కామదహనాలు
- రంగుల కొనుగోళ్లతో మార్కెట్లో సందడి
- సహజ రంగులే ఆరోగ్యానికి మేలు
- పిడిగుద్దులాటకు సిద్ధమైన హున్సా
- ఏర్పాట్లు పూర్తి చేసిన గ్రామస్తులు

## హున్సాలో నేడు పిడిగుద్దులాట

బోధన్ రూరల్, మార్చి 24: సాలూరా మండలంలోని హున్సా గ్రామంలో హోలీ పండుగ సందర్భంగా పిడిగుద్దులాట కార్యక్రమం నిర్వహించనున్నారు. గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయి ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. పిడిగుద్దులాటను ప్రత్యక్షంగా తిలకించేందుకు మహారాష్ట్ర నుంచి కూడా ప్రజలు తరలివస్తారు. పిడిగుద్దులాటకు జిల్లాలోని హున్సా గ్రామం ప్రత్యేకతగా నిలిచింది. ఈ కార్యక్రమం బయటివారికి విచిత్రంగా కనిపించినా.. హున్సా గ్రామస్తులు మాత్రం ఆచారంగా భావిస్తారు. ఈ ఆటను గ్రామస్తులు ఎంతో ఇష్టంతో ఆడుతారు.

### పిడిగుద్దులాట ఎలా ఆడుతారు...

పిడిగుద్దులాట బాక్సింగ్ ఆటను తలపిస్తుంది. హోలీ పండుగ రోజున రంగులు చల్లుకొని సందడి చేస్తారు. సాయంత్రం కుస్తీ పోటీలు నిర్వహించిన అనంతరం గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయి హనుమాన్ మందిరం వద్దకు చేరుకొని పిడిగుద్దులాటను ప్రారంభిస్తారు. సుమారు 5 నుంచి 10 నిమిషాల పాటు కొట్టుకుంటారు. ఒకవేళ ఎలాంటి గాయాలైనా మందులను వాడకపోవడం గమనార్హం. అక్కడి మట్టిని గాయపడిన చోట రాసుకుంటే గాయాలు తగ్గిపోతాయని వారి నమ్మకం.

### సహజ రంగులు

హోలీ పర్వదినం రోజున మోదుగపూలతో తయారు చేసిన రంగులను వాడితే చర్మవ్యాధులు రాకుండా ఉంటాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కెమికల్స్ కలిపిన రంగులతో హోలీ ఆడడంవల్ల కంటి జబ్బు లు, చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. మోదుగ పూలు ఈ కాలంలో వచ్చే రోగాలకు దివ్యమైన ఔషధమని పేర్కొంటారు. సహజరంగులతో పండుగ సంబురాలు జరుపుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### ఉమ్మడి జిల్లాలో కామదహన యజ్ఞం


జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం కామదహన యజ్ఞాన్ని ఆర్య సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వక్త ఆచార్య వేదమిత్ర మాట్లాడుతూ.. వనమూలికలతో కామ దహన యజ్ఞాన్ని నిర్వహించడంవల్ల ప్రకృతి శాంతిస్తుందని, లోక కల్యాణం జరుగుతుందని తెలిపారు. చెడుపై మంచికి సంకేతంగా హోలీ పండుగను ప్రతిఏటా ఫాల్గుణ పౌర్ణమి నాడు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

**కామారెడ్డిలో..**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వివేకానంద కాలనీలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో కామదహన యజ్ఞం నిర్వహించారు.

# ఏటీఎంల భద్రత గాలికి

- జిల్లాలో తరచూ చోరీలు
- పక్షంరోజుల్లో రెండు ఘటనలు
- ఏటీఎంల సెక్యూరిటీ బాధ్యత ఎవరిది?




వినాయక్‌నగర్, మార్చి 24: బ్యాంకు ఖాతాదారుల సౌకర్యం కోసం అందుబాటులోకి తెచ్చిన ఏటీఎంల వినియోగం రోజురోజుకూ పెరుగుతున్నది. 24 గంటలపాటు డబ్బులు విత్‌డ్రాచేసుకోవడంతోపాటు జమచేసే వీలుకూడా ఉండడంతో వీటికి ఆదరణ పెరిగింది. చిన్నమొత్తాల ట్రాన్స్‌ఫర్ పూర్తిగా ఏటీఎంలలోనే జరుగుతున్నది. ఖాతాదాలకు మెరుగైన సేవలను అందించేందుకు అన్ని బ్యాంకులు తమ శాఖకు సంబంధించి ఏటీఎం సెంటర్లను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేస్తున్నాయి. దీంతో వినియోగదారుల సమయం కూడా ఆదా అవుతున్నది. పెద్దమొత్తంలో నగదు లావాదేవీలు, నగలు తదితర విలువైన వస్తువులను భద్రపర్చుకునేందుకు మాత్రమే ఖాతాదారులు బ్యాంకులకు వెళ్తున్నారు. అయితే ఎక్కడపడితే అక్కడ అందుబాటులో ఉన్న ఏటీఎంల నిర్వహణతోపాటు భద్రత మాత్రం బ్యాంకులు గాలికి వదిలేశాయి. ఇందుకు జిల్లాలో జరుగుతున్న ఏటీఎం చోరీలే ఉదాహరణగా నిలుస్తున్నాయి.

### ఏటీఎంలకు భద్రత ఏదీ?

ప్రతి బ్యాంకు తమ సేవలను విస్తృతం చేయడంతోపాటు ఖాతాదారులకు ఇబ్బంది కలుగకూడదలే ఉద్దేశంతో పోటీపడి ఏటీఎంలను ఏర్పాటు చేస్తున్నాయి. వీటిని 24 గంటల పాటు వినియోగించుకునే సౌకర్యం కల్పిస్తున్నాయి. ఒక్కో ఏటీఎంలో రూ.20–25 లక్షల వరకు డబ్బులను అందుబాటులో ఉంచుతున్నాయి. అయితే గతంలో ప్రతి ఏటీఎం సెంటర్ వద్ద ఒక సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేసేవారు. టెక్నాలజీ పెరిగిన కొద్దీ సీసీ కెమెరాలు, అలారమ్ సిస్టమ్ అందుబాటులోకి రావడంతో కాపలాగా ఉన్న సిబ్బందిని తొలగిస్తూ వచ్చారు. సీసీ పుటేజీలు, అలారమ్‌ను సంబంధిత శాఖ మేనేజర్‌తోపాటు ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. ఏటీఎం సెంటర్‌లో ఎవరైనా చోరీకి ప్రయత్నిస్తే భారీ శబ్దంతోకూడిన అలారం అప్రమత్తం చేసుంది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించే అవకాశం ఉంటుంది. ఇంత టెక్నాలజీ అందుబాటులో ఉన్నప్పటికీ దొంగలు కూడా జాగ్రత్త పడుతూ చోరీలకు పాల్పడుతున్నారు.

### కెమెరాలకు నల్లరంగు పూసి..

గ్యారెంటీగా పెద్దమొత్తంలో నగదు ఉం టుందని భావిస్తున్న దుండగులు ఏటీఎంలనే టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. ఏటీఎంలలో రెండు..మూడు లాక్స్, సీసీ కెమెరాలు, అలారమ్ వంటి భద్రత ఉన్నప్పటికీ చోరీకి ప్రయత్నిస్తున్నారు. ఏటీఎం లాక్స్ ఓపెన్ కాక చోరీకి విఫలయత్నం చేసిన ఘటనలు జిల్లాలో అనేకం నమోదవుతున్నాయి. దీంతో దొంగలు ఏకంగా మెషిన్లనే పూర్తిగా ధ్వసం చేసి తమ టార్గెట్‌ను పూర్తి చేస్తున్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో ఈ నెల 13వ తేదీన రాత్రి ఎస్‌బీఐ ఏటీఎంను పూర్తిగా ధ్వసంచేసి రూ.20లక్షల నగదును ఎత్తుకెళ్లారు. దుండగులు తమ ఆనవాళ్లు రికార్డు కాకుండా తెలివిగా సీసీ కెమెరాలకు బ్లాక్ కలర్‌ను ( సే ) చేసిన అనంతరం తమ పని మొదలు పెట్టారు. ఏకంగా మెషిన్‌ను ఊడబీకి అందులోని డబ్బులు తీసుకొని బయట పడేశారు. ఫిబ్రవరి 28వతేదీన నవీపేట్ మండలకేంద్రలోని ఓ ఏటీఎంలో దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. సెంటర్‌లోకి చొరబడి మెషిన్ కింది భాగాన్ని ధ్వంసం చేసినా డబ్బులు కనిపించకపోయేసరికి అక్కడి నుంచి పారిపోయారు.



### మరింత అప్రమత్తత అవసరం..

ఏటీఎంల నిర్వహణ, భద్రతపై ప్రజల నుంచి అనేక విమర్శలు ఉన్నాయి. మెషిన్లు పనిచేయకపోయినా, సెంటర్లలో ఏం జరిగినా వాటిని పట్టించుకునేవారు ఉండరని అంటున్నారు. ప్రతిరోజూ పెద్ద మొత్తంలో నగదు అందుబాటులో ఉండే ఏటీఎం సెంటర్ల వద్ద సెక్యూరిటీ సిబ్బంది ఉండాల్సిన అవసరం ఉంది. కొన్ని ఏటీఎం సెంటర్లలో మోసగాళ్లు వినియోగదారులకు మాయమాటలు చెప్పి డబ్బులు కాజేయడం, ఏటీఎం కార్డులను మార్చడం వంటివి చేస్తున్నారు. అమాయకులకు టోపీ పెట్టి క్షణాల్లో మాయమవుతున్నారు. ఏటీఎంల చోరీ ఘటనలపై బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులుపుకొంటున్నారు. అయితే ఇటీవల చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో బ్యాంకు అధికారులతో పోలీసులు సమావేశం నిర్వహించి ఏటీఎం సెంటర్ల భద్రతపై సూచనలు చేశారు. గతంలో మాదిరిగానే సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

# మద్యం దుకాణాలు బంద్

### సీపీ కల్మేశ్వర్ సింగెనవార్



వినాయక్‌నగర్, మార్చి 24: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజలు హోలీ పండుగా ప్రశాంతంగా జరుపుకోవాలని, మద్యం మత్తులో ఎలాంటి అల్లర్లు, గొడవలకు పోకుండా సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. హోలీ పండుగ వేళ మద్యం, కల్లు సేవించి రోడ్లపై హంగామా చేస్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా ఉండేందుకు మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్లు ప్రకటించారు. అండర్ సెక్షన్ 20(1) ఆఫ్ ఎక్సైజ్ యాక్ట్ 1968 ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఉన్న కల్లు దుకాణలు, కల్లు డిపోలు, బార్లు, వైన్స్,క్లబ్‌లు మూసి ఉంచాలని సీపీ ఆదేశాలు జారీచేశారు. 24వ తేదీ సాయంత్రం 6 నుంచి 26వ తేదీ మంగళవారం ఉదయం వరకు లిక్కర్ షాపులు బంద్ చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

### సకాలంలో మంటలార్పిన ఫైర్ సిబ్బంది

వినాయక్‌నగర్, మార్చి 24: నిజామాబాద్ నగరంలోని ఇంద్రాపూర్ ఏరియాలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ రిపేరింగ్(ప్రైవేటు) సెంటర్‌లో ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. ఆకస్మికంగా మంటలు అంటుకోవడంతో సిబ్బంది వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సెంటర్‌లో ఆయిల్, డిజిల్ నిల్వలు ఉంటాయని, వాటికి అంటుకుంటే భారీ నష్టం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తేవడంతో ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

# జిల్లా కేంద్రంలో సైబర్ మోసం

- బ్యాంకు ఉద్యోగినంటూ కిరాణావ్యాపారికి టోకరా
- క్యూఆర్‌కోడ్ అప్‌డేట్ చేయాలంటూ సెల్‌ఫోన్ అపహరణ
- షాపు యజమాని ఖాతా నుంచి రూ. లక్షా 6వేలు మాయం



వినాయకనగర్, మార్చి 24: జిల్లాలో రోజురోజుకూ సైబర్ మోసాలు పెరుగుతూనే ఉన్నాయి. పోలీసుశాఖ, ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలంటూ ఎంత అవగాహన కల్పించినా ఏదో ఒకచోట ప్రజలు సైబర్ మోసాల బారిన పడుతూనే ఉన్నారు. జిల్లా కేంద్రంలో ఐదు రోజుల క్రితం ఓ కిరాణావ్యాపారి సైబర్ మోసగాడి వలలో పడి రూ. లక్షా 6వేలు పోగొట్టుకున్నాడు. ఇందుకు సంబంధించి వివరాలు.. నగరంలోని రెండోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దబజార్ ప్రాంతంలో ఉన్న కిరాణాషాపు యజమాని రాజ్‌కుమార్ వద్దకు ఓ వ్యక్తి వచ్చి తాను బ్యాంకు ఉద్యోగిని అని, మీ బ్యాంకు ఖాతాకు క్యూఆర్‌కోడ్ అప్‌డేట్ చేయాలంటూ నమ్మించాడు. దీంతో షాపు యజమాని తన సెల్‌ఫోన్ లాక్‌ఓపెన్ చేసి నకిలీ బ్యాంకు ఉద్యోగి చేతిలో పెట్టి గిరాకీ రావడంతో లోపలికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన నకిలీ ఉద్యోగి షాప్ యజమాని సెల్‌ఫోన్ తీసుకొని అక్కడి నుంచి ఉడాయించాడు. మరుసటి రోజు తన ఖాతా నుంచి రూ. లక్షా 6వేలు కాజేసినట్లు గుర్తించిన కిరాణ షాపు యజమాని వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.రాము తెలిపారు.




నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ధర్మపురి కాలనీలో ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ విందుకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్‌అలీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
– కంఠేశ్వర్, మార్చి 24

# నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్, మార్చి 24: నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగుచేస్తున్న యాసంగి పంటలకు ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా ఏడో విడుత నీటిని ఆదివారం ఉదయం విడుదల చేశారు. ప్రాజెక్టు ఆయకట్టు కింద సాగు చేస్తున్న లక్షా 25 వేల ఎకరాలకు ఏడు విడుతల్లో 11 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నామని, ఇప్పటి వరకు ఆరు విడుతల్లో 9.16 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.చివరి ఆయకట్టు పంటలు చాలా వరకు చేతికి అందడంతో ప్రస్తుతం ఏడో విడుత నీటిని డిస్ట్రిబ్యూటరీ ఒకటి నుంచి 39 వరకు విడుదల చేస్తున్నట్లు నీటి పారుదల శాఖ ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టులో నీటి నిల్వ తక్కువగా ఉన్నందున ఆయకట్టు రైతులు నీటిని వృథా చేయకుండా సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405.00 అడుగులు (17.80 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1394.00 అడుగుల (6.17 టీఎంసీలు) వద్ద ఉన్నదని పేర్కొన్నారు. ప్రధాన కాలువ ద్వారా 1500 క్యుసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. నీటి విడుదల ఈనెల 31 వరకు కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ కామారెడ్డి ఎన్నికల ఇన్‌చార్జిగా గంప గోవర్ధన్



కామారెడ్డి, మార్చి 24: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. బీఆర్ఎస్ కామారెడ్డి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా ఆయనను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించారు.

# తెలంగాణ సెపక్‌తక్రా కెప్టెన్‌గా లాస్యప్రియ



కంఠేశ్వర్, మార్చి 24 : సెపక్‌తక్రా తెలంగాణ సబ్‌జూనియర్ బాలికల జట్టు కెప్టెన్‌గా నిజామాబాద్ జిల్లాకు చెందిన లాస్యప్రియ ఎంపికైనట్లు సెపక్‌తక్రా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాదారి సంజీవ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు కర్ణాటకలోని ధవనగిరిలో నిర్వహించే 26వ సెపక్‌తక్రా సబ్‌జూనియర్ టోర్నమెంట్‌కు లాస్యప్రియ కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఆమెను జిల్లా అధ్యక్షుడు కేశవేణు, ఉపాధ్యక్షులు దీపిక, గంగారెడ్డి, సంయుక్త కార్యదర్శి మీసాల ప్రశాంత్, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.